తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

కలెక్టర్‌ను కలిసిన సివిల్స్ ర్యాంకర్లు

హన్మకొండ అర్బన్: సివిల్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన హనుమకొండ జిల్లాకు చెందిన రావుల జయసింహారెడ్డి, పత్తిపాక సాయికిరణ్, కొట్టె రుత్విక్‌సాయి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు. సివిల్స్ పరీక్షలకు సిద్ధమైన విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చిన్న వయస్సులోనే సివిల్స్ ఉద్యోగాన్ని సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో నిరుపేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతి కోసం విధి నిర్వహణలో ముందుకు సాగాలని సూచించారు. హనుమకొండ నుంచి ఆరుగురు అభ్యర్థులు సివిల్స్ ర్యాంకులు సాధించినట్లు కలెక్టర్‌కు వారు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, సామాజిక వేత్త ఈ.వి శ్రీనివాస్‌రావు, కొమురెల్లి, రాధాకృష్ణరావు పాల్గొన్నారు.


హన్మకొండ అర్బన్: కలెక్టర్‌తో సివిల్స్ ర్యాంకర్లు

సివిల్స్ ర్యాంకర్ రుత్విక్ సాయికి సన్మానం

హన్మకొండ: సివిల్స్ ర్యాంకర్ కొట్టె రుత్విక్ సాయిని రాంనగర్ మున్నూరుకాపు పరపతి సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండ రాంనగర్‌లోని ఆయన స్వగృహంలో ఆయనను మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు గుర్రాల రాజ్‌కుమార్, కొటం సంతోష్, తోట వేణు, వాసు, తోట చందర్, తోట మహేష్, ఎస్.కుమార్, తోట నాగరాజు, తోట ధను, లక్కాకుల రాజు గురువారం కలిసి మొక్క, జ్ఞాపిక అందించి అభినందించారు.

టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో..

రిత్విక్ సాయిని టీఎన్జీవోస్ యూనియన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సన్మానించారు. అభినందించిన వారిలో టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, కోశాధికారి పాలకుర్తి సదానందం, మెడికల్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి శ్రీనివాస్, నాయకులు వేముల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రాజేష్, భరత్, కుమారస్వామి ఉన్నారు.

నాలాల్లో పూడికతీతపై జాప్యమెందుకు?

వరంగల్ అర్బన్: నాలాల్లో పూడికతీతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించినా ఎందుకు జాప్యం చేస్తున్నారని నగర మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రకాళి, రంగంపేట నాలాలతోపాటు, అంతర్గత డ్రెయినేజీలను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి మేయర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంజీఎం నుంచి బల్దియా షీ టాయిలెట్ వెనుక నుంచి వెళ్లి భద్రకాళి నాలాలో కలిసే అంతర్గత నాలా పూడికతీతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 33 ప్రధాన నాలాలు, అంతర్గత నాలాలకు సమాంతరంగా చిన్న మురుగు కాలువల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఆ పనులను మరింత వేగిరం చేసేందుకు వింగ్ అధికారులతో రోజు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సీపీ వెంకన్న, డీఈ రవికుమార్, ఏసీపీ శ్రీనివాస్, లా ఆఫీసర్ శ్రీనివాస్, టీపీబీఓ అనిల్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


నాలాను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

పేదలందరికి పట్టాలు ఇవ్వాలి



హన్మకొండ: గుడిసెలు వేసుకుని నివసిస్తున్న అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాల పట్టాలు అందించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం రెండో బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని సమ్మయ్యనగర్, వైఎస్సార్ కాలనీ, నాగేంద్రనగర్, తెట్టెకుంట, దీన్‌దయాళ్ నగర్, రామన్నపేట, ఎస్‌ఐటీ తండా వంటి తదితర ప్రాంతాల్లో 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని పేదలు నివాసం ఉంటున్నారని గుర్తుచేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకు జీఓ నంబర్లు 58, 59 పేరుతో అక్కడక్కడా కొందరికి పట్టాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వం మభ్య పెడుతోందని విమర్శించారు.



కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, పక్కన సుందర్‌రాజ్, యాదవరెడ్డి, తదితరులు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. ఆయా పథకాలను సంఘటిత, అసంఘటిత కార్మికులకు అందజేయాలనే సంకల్పంతో కార్మిక మాసోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పేదలకు 58 జీఓ ద్వారా ఇళ్ల పట్టాలను అందించినట్లు గుర్తుచేశారు. ప్రతి కార్మికుడికి 24 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం నిధులు ఇచ్చి ప్రభుత్వరంగ సంస్థను కాపాడుతోందని అన్నారు. 54 రంగాలకు చెందిన కార్మికులకు భద్రత కల్పించే దిశగా సర్కారు కృషి చేస్తుందని వివరించారు. ఇటీవల కాలంలో 6,900 మంది కార్మికులకు రూ.40 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్రశేఖర్ గురువారం ఉదయం మృతి చెందాడని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. సమావేశంలో కూడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్మిక మాసోత్సవ కో ఆర్డినేటర్ పుల్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఇమ్యూనైజేషన్

కాశిబుగ్గ: వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో ప్రతినెల మొదటి శనివారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనచారి ఓ ప్రకటనలో తెలిపారు.



'హలో వికలాంగ్.. చలో కలెక్టరేట్'

హన్మకొండ అర్బన్: వికలాంగుల హక్కుల సాధన కోసం ఈనెల 4న హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే 'హలో వికలాంగ్.. చలో కలెక్టరేట్' ధర్నాను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మందకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈమేరకు వడ్డెపల్లిలోని వికలాంగుల సంక్షేమ హాస్టల్‌లో ధర్నా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేల పింఛన్ పెరిగిన నిత్యావసరాలకు సరిపోవడం లేదని, ఈక్రమంలో రూ.6 వేల వరకు పెంచాలని కోరారు. రోస్టర్ పాయింట్ 10కంటే ఎక్కువ ఉండటం వలన వికలాంగులు చాలా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, దివ్యాంగులు, తదితరులు

'కొండా'పై బురదజల్లితే ఊరుకునేది లేదు

కాశిబుగ్గ / వరంగల్ : కొండా మురళి, సురేఖ దంపతులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని కొండా యువసేన జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ అన్నారు. కొండా యువసేన ఆధ్వర్యంలో శివనగర్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ.. నగరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో జరిగిన ఘర్షణకు కొండా దంపతులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పార్టీలోని కొంతమంది కోవర్టులు కొండా దంపతులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అది సరికాదని హెచ్చరించారు. సమావేశంలో కొండా యువసేన నాయకులు వసీం, సాజిత్, వినోద్, రాహులాల, అనిల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివకుమార్



నేత్రపర్వంగా ధనమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని మెట్ల బావి ధనమైసమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. గురువారం ఉదయం 5గంటలకు గణపతి పూజలు, గణపతి హోమం, నవగ్రహ పూజలు, ధనమైసమ్మ శాంతిపూజలు జరిపించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అనంతరం ధనమైసమ్మ తల్లిని ఆలయ నిర్మాణ దాత, స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వాణి దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బీజేపీ నేత గంట రవికుమార్ దర్శించుకున్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

శ్వేతార్క ఆలయంలో వరుణ పూజలు

కాజీపేట: వేసవితాపం తగ్గి సకాలంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గురువారం సాయంత్రం పండితులు వంద కడవల నీటితో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పండితులు భక్తులు తెచ్చిన నీటితో అభిషేకాలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు సాయికృష్ణ శర్మ దంపతులు 108 కొబ్బరి కాయలు కొట్టి సహస్ర ధారాభిషేకం చేశారు. ఇంద్రధనుస్సులోని ఏడు రంగులతో ప్రత్యేక వరుణ పూజలు నిర్వహించారు. రాధాకృష్ణ శర్మ పర్యవేక్షణలో రుద్ర నమకచమక పారాయణ సహిత పూజలు చేశారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు అన్నదానం చేశారు.







క్రమబద్ధీకరించాలని మంత్రికి వినతి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జేఏసీ చైర్మన్ డాక్టర్ పరశురామ్, కన్వీనర్ డాక్టర్ కరుణాకర్‌రావు బాధ్యులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ బాధ్యులు బైరి నిరంజన్, సాధు రాజేష్, మాదాసి కనకయ్య, వేల్పుల కుమార్, చిర్ర రాజు, సురేష్‌నాయక్, శశికాంత్, శివారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

హన్మకొండ: ముదిరాజ్ కులస్తులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 60లక్షల మంది ముదిరాజ్ కులస్తులు ఉన్నారని, రిజర్వేషన్లకు లేకపోవడంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు.





రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 3వ తేదీన నిర్వహించనున్న రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు వేలమందితో సమావేశం నిర్వహించాలని సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ జిల్లా చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, ఎంపీఓ రవిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురేందర్ రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్లావుల లలితాయాదవ్



'బస్సులను పునరుద్ధరించాలి'

ఖిలా వరంగల్: విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ లోకల్ బస్సులను పునరుద్ధరించాలని సామాజిక న్యాయవేదిక ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ గతంలో వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు కాలనీలకు ఆర్టీసీ లోకల్ బస్సులు నడిచేవారని గుర్తు చేశారు. ఖిలా వరంగల్ తూర్పుకోట, పడమరకోట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు కరీమాబాద్‌కు నిత్యం ఆర్టీసీ లోకల్ బస్సు సౌకర్యం ఉండేదని వివరించారు. రోడ్లు అభివృద్ధి చెందినా బస్సులు తిరగటం లేదని వినోద్‌కుమార్ వాపోయారు.

'అతిథి'లో అన్నదానం

హన్మకొండ చౌరస్తా: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ భూపతి శంకర్ పుట్టినరోజు వేడుకలను నగరంలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సతీసమేతంగా భూపతి శ్యామల, శంకర్.. ఆశ్రమంలోని పిల్లలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పీడీజీలు ఆదినారాయణ, కుసుమ లింగమూర్తి, మండల రవీందర్, వీడీజీలు శ్రీధర్‌బాబు, సంతోష్‌కుమార్, సాయిరెడ్డి, డిస్ట్రిక్ కేబినెట్ సెక్రటరీ దండబోయిన శ్రీలత, ఆశ్రమ నిర్వాహకురాలు సుజాత పాల్గొన్నారు.